

నోరు లేని మేకల్నే బలి ఇస్తారు.
సింహాల్ని బలివ్వరు, గుర్తించుకోండి.
- డా. బిఆర్ అంబేద్కర్

REGD NO : APTEL 16144

# జన స్వరం

పవర్ అక్షరమే ఆయుధం ✍

www.Janaswaram.com

జనస్వరం న్యూస్ తెలుగు వారపత్రిక ద్వారా తక్కువ ఖర్చుతో పుట్టినరోజు శుభాకాంక్షలతో పాటు అన్నీ కార్యక్రమాలకు ప్రకటనలకు సంప్రదించండి.
మా మెయిల్ ఐడి : janaswaramnews@gmail.com
మొబైల్ నెంబర్ : 9642067900

సంపుటి : 4 | సంచిక : 303 | ఎడిటర్ : నరేష్ సాకే | వార సంచిక : 17 - 05 - 2025 | పేజీలు : 5


# ఈసారి మనపై దాడి చేస్తే పాకిస్థాన్ కు అదే చివరి రోజు అవుతుంది

**- ఆపరేషన్ సిందూర్ విజయవంతం**
**- విజయవాడలో తిరంగా ర్యాలీ**
**- హాజరైన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్**

**విజయవాడ, 17 మే, జనస్వరం :** మహిళల నుదుట సింధూరాన్ని తుడిచిన ఉగ్రవాదులకు ఆపరేషన్ సిందూర్ తో ధీటుగా బదులిచ్చామని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. భారత్ పై తమ ఆటలు సాగవని పాకిస్థాన్ గ్రహించాలని, మన దేశంపై దాడి చేస్తే అదే వారికి చివరి రోజు అవుతుందన్నారు. ఉగ్రవాదంపై అలుపెరుగుని పోరాటం చేస్తున్న సైనికులకు సెల్యూట్ చేస్తున్నానన్నారు. మోదీ రూపంలో దేశానికి సమర్థవంతమైన నాయకుడు లభించాడని, ఉగ్రవాదం అంతు చూడాలని ప్రధాని సంకల్పించారని అన్నారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా విజయవాడలో నిర్వహించిన తిరంగా ర్యాలీలో సీఎం చంద్రబాబు , జనసేన అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఏపీ రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ... పహల్గామ్ ఘటన గుర్తుకురాగానే మనలో పౌరుషం, ఉద్వేగం వస్తుంది. భార్య ముందే భర్తను, కొడుకు ముందే తండ్రిని మతం పేరు అడిగి మరీ చంపేశారు. ఆడబిడ్డల నుదుట తిలకం తుడిచిన ఉగ్రవాదులు ఈ భూమి మీద ఉండకూడదని ఆపరేషన్ సిందూర్ కు శ్రీకారం చుట్టాం. ఉగ్రవాదంపై పోరాడుతున్న మన సైనిక దళాలకు సెల్యూట్ చేస్తున్నాను. అత్యంత కఠినమైన పరిస్థితుల్లో దేశాన్ని కాపాడుతున్న జవాన్లకు నమస్కరిస్తున్నాను. వారి పోరాటం వల్లే మనం క్షేమంగా ఉన్నాం. మన దేశ గౌరవం, బలం, బలగం సాయుధ బలగాలే. రక్షణ దళాలు... ఉగ్రవాదులు ఈ దేశంపై కన్నెత్తి చూడకుండా పోరాడాయి. మన సైనికులను చూసి ఏపీనే కాదు... దేశమంతా గర్విస్తోంది. మనం అధైర్యపడాల్సిన అవసరం లేదు. జాతీయ జెండా చూడగానే మనందరిలో ఉత్సాహం, ఉద్వేగం, దేశభక్తి కలుగుతుంది. ఆ జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య ఈ ప్రాంతం వారే కావడం మనందరికీ గర్వకారణం.

**ఉగ్రవాదంపై ప్రధాని మోదీ రాజీలేని పోరాటం :**

మన దేశానికి సరైన సమయంలో దొరికిన సమర్థ నాయకుడు ప్రధాని మోదీ. ప్రపంచాన్ని పట్టిపీడిస్తున్న సమస్య ఉగ్రవాదం. మనం ఎప్పుడూ ఇతర దేశాలపై యుద్ధాలకు వెళ్లం. మన జోలికి వస్తే మాత్రం తగిన బుద్ధి చెప్పితీరుతాం. ప్రధాని మోదీ ఉగ్రవాదంపై రాజీలేని పోరాటం చేస్తున్నారు. ఉగ్రవాదులు ప్రపంచంలో ఎక్కడా దాక్కున్నా తుదముట్టించేందుకు ప్రధాని సంకల్పం తీసుకున్నారు. ఆపరేషన్ సిందూర్ తో శత్రు దేశాల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. తీవ్రవాద రూపంలో మనదేశానికి వస్తే అదే వారికి చివరిరోజవుతుంది. మన దేశం రక్షణలోనే కాదు ఆర్థిక శక్తిగానూ ఎదుగుతోంది. కుట్రలు, కుతంత్రాలు, అసూయ పడేవారెవరూ మన దేశాన్ని ఏం చేయలేరు. 2047 నాటికి ప్రపంచంలోనే భారతదేశం మొదటి లేదా రెండో స్థానాల్లో నిలుస్తుంది. దేశ భద్రత, సమగ్రత కోసం మనమంతా ఏకతాటిపై నడవాలి. దేశం కోసం ప్రాణాలర్పించిన మురళీ నాయక్ స్ఫూర్తితో ముందుకు వెళదాం అని సీఎం చంద్రబాబు అన్నారు.

'భారత దేశ అభివృద్ధిని చూసి ఓర్వలేకే పాకిస్థాన్ ఉగ్రవాదులను పెంచి పోషించి దాడులకు పాల్పడుతోంద'ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు శ్రీ పవన్ కళ్యాణ్ గారు స్పష్టం చేశారు. 1947లో దేశ విభజన జరిగిన నాటి నుంచి దేశం ఏనాడు ప్రశాంతత చూసింది లేదన్నారు. శాంతి.. శాంతి అంటూ వల్లించే శాంతి వచనాలు వారికి పని చేయవన్నారు. ఇప్పటి వరకు సహనంతో మా చేతులు కట్టేశారు. ఇక పాకిస్థాన్ ఆటలు సాగవన్నారు. మీరు మా దేశంలోకి వచ్చి కొడితే మేము మీ ఇళ్లలోకి వచ్చి కొడతామని హెచ్చరించారు. శుక్రవారం ఆపరేషన్ సిందూర్ విజయానికి మద్దతుగా విజయవాడలో నిర్వహించిన తిరంగా ర్యాలీలో గౌరవ ముఖ్యమంత్రివర్యులు శ్రీ చంద్రబాబు నాయుడు గారు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు శ్రీమతి పురందేశ్వరి గారు, రాష్ట్ర మంత్రులు, శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలసి పాల్గొన్నారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి బెంజి సర్కిల్ వరకు జాతీయ జెండా చేతబూని రెపరెపలాడిస్తూ సూమారు మూడు కిలోమీటర్లు నడిచారు. ఆద్యంతం జాతీయ భావం వెల్లివిరియగా.. వేలాది మంది నగర ప్రజలు స్వచ్ఛందంగా ర్యాలీలో పాల్గొని భారత సైన్యం తాలూకు శౌర్యాన్ని కీర్తించారు. భారత్ మాతా కీ జై అని నినదిస్తూ గౌరవ ముఖ్యమంత్రివర్యులు, ఉప ముఖ్యమంత్రివర్యులు ముందుకి కదలగా వేలాది మంది జాతీయ పతాకాలు చేతబూని వారిని అనుసరించారు. బెంజి సర్కిల్ వద్ద ర్యాలీ




ముగిసిన అనంతరం శ్రీ పవన్ కళ్యాణ్ గారు మాట్లాడుతూ "తిరంగా యాత్రకు మద్దతు తెలుపుతున్న సమస్త ప్రజానీకానికి నమస్కారాలు. దేశ విభజన జరిగిన నాటి నుంచి మనం ఏనాడు ప్రశాంతత చూడలేదు. కసబ్ లాంటి తీవ్రవాదులు దేశంలోకి చొరబడి 72 గంటల పాటు ఎలాంటి దాడులు చేశారో చూశాం. ముంబయి పేలుళ్లు, కోయంబత్తూరు పేలుళ్లు, గోకుల్ చాట్ పేలుళ్లు, జామా మసీదు పేలుళ్లు, లుంబనీపార్కు పేలుళ్లు వీటన్నింటి వెనుక పాకిస్థాన్ హస్తం ఉంది.

మనం ఈ రోజు విజయవాడ నడిబొడ్డున కూర్చుని మాట్లాడుతున్నామంటే అది సరిహద్దుల్లో మన సైనికులు ఉన్నారన్న ధైర్యమే. అదే సరిహద్దు రాష్ట్రాలు అయిన జమ్మూ కశ్మీర్, రాజస్థాన్, హర్యానా... అక్కడ ఇంత ప్రశాంతత ఉండదు. మన దేశానికి మనం చేయగలిగింది ఒకటే. సైన్యానికి మనం అండగా ఉన్నాం అని ధైర్యం చెప్పడమే. దేశం లోపల ఉన్న సూడో సెక్యులరిస్టులు సెక్యులరిజం ముసుగులో దేశ సైన్యాన్ని బలహీనపరిచే విధంగాగాని, కించపరిచే విధంగాగాని వ్యాఖ్యలు చేస్తే... ఆ వ్యాఖ్యలు చేసిన వారు ఏ స్థాయి వ్యక్తులైనా వారికి బలమైన జవాబు చెప్పి వారి నోరు మూయించడం మనందరి కర్తవ్యం. మన సైన్యం కోసం మనం బలంగా నిలబడాలి. శ్రీ మురళీ నాయక్ 23 ఏళ్ళ కుర్రాడు. భారత్ మాతాకీ జై చెప్పారు. అటువంటి వారే నిజమైన దేశ భక్తులు. సెలబ్రిటీలు, హీరోలు ఎవరూ మాట్లాడడం లేదు అంటే వారెవరూ దేశాన్ని నడిపేవారు కాదు. వారు వినోదాన్ని పంచే వారు మాత్రమే.. సెలబ్రటీస్ నుంచి అంతకు మించి దేశభక్తి ఆశించకండి. దేశభక్తుడు అంటే మురళీ నాయక్ లాంటి వారు. మరణిస్తే దేశాన్ని కాపాడుతూ సైనికుడిగా పోవాలి అనుకున్నారు. అతని తల్లిదండ్రులకు ఏం చెప్పగలం. దేశంకోసం ప్రాణాలు ఇచ్చిన శ్రీ మురళీనాయక్ ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నాను. ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ గారికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలియజేస్తున్నాం. మురళీ నాయక్ అమర్ హై.." అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆహార పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ గారు, శాసన మండలిలో ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్ గారు, కూటమి పక్షాలకు చెందిన మంత్రులు, శాసన సభ్యులు, మూడు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

## ఇతరులు పాలసీలు చూసిన చోట ఆయన అవకాశాలు చూశారు : మంత్రి నారా లోకేశ

ఆంధ్రప్రదేశ్‌ను పునరుత్పాదక ఇంధన రంగంలో అగ్రగామిగా నిలపాలన్న లక్ష్యంతో ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా, అనంతపురం జిల్లా, గుంతకల్లు నియోజకవర్గం, బేతపల్లి గ్రామంలో రెన్యూ పవర్ సంస్థ ఏర్పాటు చేయనున్న రూ.22 వేల కోట్ల విలువైన భారీ హైబ్రిడ్ ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్టుకు రాష్ట్ర ఐటీ, విద్యా శాఖల మంత్రి నారా లోకేశ్ నేడు భూమిపూజ చేశారు. ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతితో పాటు వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ, "రెన్యూ పవర్ ప్రాజెక్టుకు మనం వేస్తున్న పునాదిరాయి, భారతదేశ క్లీన్ ఎనర్జీ విప్లవానికి పునాదిరాయి వంటిది. రూ.22 వేల కోట్ల పెట్టుబడితో రూపుదిద్దుకోనున్న ఈ ప్రాజెక్టు కేవలం గ్రిడ్‌లకు శక్తినివ్వడమే కాకుండా, నిరుద్యోగ యువత ఆశయాలకు ఊతమిస్తుంది" అని పేర్కొన్నారు. పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టు కేవలం పరిశ్రమ కాదని, అదొక ఉద్యమమని, భవిష్యత్ తరాలకు ఇదొక వారధి అని ఆయన అభివర్ణించారు. "రెన్యూ పవర్ వారి పునరుత్పాదక ఇంధన సముదాయ ప్రారంభోత్సవం... సాహసోపేతమైన నిర్ణయానికి, స్థిరమైన ప్రగతికి చిహ్నం. ఈ చారిత్రాత్మక క్షణంలో భాగం కావడం నా అదృష్టంగా భావిస్తున్నాను. రూ.22వేల కోట్ల పెట్టుబడితో చేపట్టే ఈ ప్రాజెక్ట్ రేపటి వెలుగుకు దారి చూపుతుంది. పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టు కేవలం పరిశ్రమ మాత్రమే కాదు... ఇది ఒక ఉద్యమం. ఈ రోజు మన కలలకు, భవిష్యత్ తరాలకు వారధి లాంటిది. భూమిపై సూర్యకాంతి, స్వచ్ఛమైన, అమూల్యమైన గాలి లభిస్తున్నపుడు భావితరం కోసం మరోగ్రహం కోసం ఎందుకు ఆలోచించాలి? శిలాజ ఇంధనాల నుండి భవిష్యత్ ఇంధనాల వినియోగం కోసం మేం ముందడుగు వేస్తున్నాం. భావితరాల కోసం ఒక ఉన్నత లక్ష్యంతో పని చేస్తున్నాం" అని వివరించారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికత వల్లే ఆంధ్రప్రదేశ్ క్లీన్ ఎనర్జీ రంగంలో ట్రెండ్ సెట్టర్‌గా నిలుస్తోందని లోకేశ్ కొనియాడారు. "ఇతరులు పాలసీలు చూసిన చోట ఆయన అవకాశాలను చూశారు. చంద్రబాబు గారి మార్గదర్శకత్వంలో రూపొందించిన ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ (ICE) పాలసీ భారతదేశ హరిత విప్లవానికి బ్లూప్రింట్‌గా మారింది" అని ప్రశంసించారు. కేవలం 8 నెలల వ్యవధిలోనే టాటా పవర్, ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్, వేదాంత సెరెంటికా, సెయిల్ ఇండస్ట్రీస్, బ్రూక్‌ఫీల్డ్ వంటి క్లీన్ ఎనర్జీ దిగ్గజాలను రాష్ట్రానికి రప్పించగలిగామని గుర్తుచేశారు.




## ఏపీ లిక్కర్ స్కాంలో కీలక పరిణామం...

ఏపీ లిక్కర్ స్కాం కేసు దర్యాప్తులో నేడు కీలక పరిణామం చోటుచేసుకుంది. సుదీర్ఘ విచారణ అనంతరం, నాటి ముఖ్యమంత్రి కార్యదర్శిగా పనిచేసిన ధనుంజయ్‌రెడ్డితో పాటు, అప్పటి సీఎం ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డిని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) అధికారులు అదుపులోకి తీసుకున్నారు. మూడు రోజుల పాటు వీరిని విచారించిన సిట్ అధికారులు, మద్యం కుంభకోణంలో వీరి ప్రమేయంపై స్పష్టత వచ్చిన తర్వాత ఈ సాయంత్రం అరెస్టు చేసినట్లు వెల్లడించారు. దాదాపు తొమ్మిది గంటల పాటు వీరిద్దరినీ సిట్ అధికారులు ప్రశ్నించినట్లు సమాచారం. ఈ కేసులో ధనుంజయ్‌రెడ్డి ఏ31 నిందితుడిగా, కృష్ణమోహన్‌రెడ్డి ఏ32 నిందితుడిగా ఉన్నారు. కాగా, ఇదే కేసులో వీరికి ముందస్తు బెయిల్ మంజూరు చేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్లను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. పిటిషనర్లకు వ్యతిరేకంగా తగిన ఆధారాలు ఉన్నాయని, దర్యాప్తు కీలక దశలో ఉన్నందున ఈ సమయంలో ముందస్తు బెయిల్ ఇవ్వలేమని జస్టిస్ పార్థీవాలా నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే అది దర్యాప్తు అధికారి విచారణకు ఆటంకం కలిగించినట్లు అవుతుందని అభిప్రాయపడింది. అంతకుముందు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కూడా వీరి ముందస్తు బెయిల్ అభ్యర్థనను తిరస్కరించగా, ఆ తీర్పును సవాల్ చేస్తూ వీరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే, హైకోర్టు లేదా ట్రయల్ కోర్టును ఆశ్రయించవచ్చని సుప్రీంకోర్టు సూచించింది. రెగ్యులర్ బెయిల్ కోసం నిబంధనలు, మెరిట్స్ ఆధారంగా హైకోర్టు లేదా ట్రయల్ కోర్టును ఆశ్రయించవచ్చని సుప్రీంకోర్టు సూచించింది.

## జీవితం - వి "చిత్రం"



@Telugu_toonz (X)

## ఈరోజు పంచాంగం వేళలు

తేదీ : 17 మే 2025
తిథి : శుద్ది విదియ ( మ : 2.01 వరకు )
నక్షత్రం : ధనిష్ట ( తె 5.52 వరకు )
బ్రహ్మముహూర్తం : తె 5.16 నుండి తె 6.01 వరకు
రాహుకాలం : ఉ 11.08 నుండి మ 12.33 వరకు
యమగండం : మ 3.24 నుండి సా 4.49 వరకు
వర్జ్య కాలం : మ 12.37 నుండి మ 2.17 వరకు

## ఈరోజు నమాజ్ వేళలు

తేదీ : 17 మే 2025
ఫజర్ : 5.35 ఉదయం
సూర్యోదయం : 6.48 ఉదయం
జొహర్ : 12.34 మధ్యాహ్నం
అసర్ : 3.52 సాయంత్రం
మఘ్రిబ్ : 6.19 సాయంత్రం
ఇషా : 7.32 సాయంత్రం


జన స్వరం
విలేకరులు కావలెను
"జనస్వరం" ఈ-దినపత్రిక (వెబ్ పత్రిక) నందు పని చేయుటకు
రెండు తెలుగు రాష్ట్రాల్లో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి విలేకరులు కావలెను..
అసక్తి ఉన్న వారు సంప్రదించండి..
సాయి కల్యాణ్
ఫోన్ నెం : 7013030690
మేనేజింగ్ డైరెక్టర్
జనస్వరం మీడియా



# వైఎస్ జగన్ పాదయాత్ర.! బెదిరిపోతున్న వైసీపీ నేతలు.!

## ఎడిటోరియల్

వైసీపీ అధినేత, పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్ మోహన్ రెడ్డి త్వరలో పాదయాత్ర చేయబోతున్నారట. ఈ విషయాన్ని వైసీపీ నేతలే చెబుతున్నారు. అయితే, అప్పుడే కాదు లెండి.. ఇంకాస్త సమయం వుంది. 2027లో పాదయాత్ర వుంటుందన్నది వైసీపీ శ్రేణులు చెబుతున్నమాట. కాస్త ముందుగానే.. అంటే, 2026 చివర్లో పాదయాత్ర ప్రారంభించే అవకాశాలూ లేకపోలేదుట. ఎందుకీ పాదయాత్ర.? అంటే, గతంలో తనకు పాదయాత్రే అధికార పీఠాన్ని ఇచ్చిందని వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బలంగా విశ్వసిస్తున్నారు గనుక. నారా లోకేష్ పాదయాత్ర, టీడీపీకి అధికారం తెచ్చిందని కూడా వైసీపీ పరోక్షంగా అంగీకరించక తప్పని పరిస్థితి. అంతకు ముందు, చంద్రబాబు కూడా పాదయాత్ర చేసే అధికారంలోకి వచ్చారు. చంద్రబాబు కంటే ముందు, వైఎస్ రాజశేఖర్ రెడ్డి, పాదయాత్ర ద్వారానే, అధికార పీఠమెక్కారు. సరే, పాదయాత్ర చేసే హక్కు వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి వుంది. ఇందులో ఇంకో మాటకు తావు లేదు. పైగా, పాదయాత్ర ఆయనకు అలవాటే. కానీ, ఒకప్పటి పాదయాత్రలకీ, ఇప్పటి పాదయాత్రలకీ చాలా తేడా. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 2019 ఎన్నికలకు ముందు చేసిన పాదయాత్ర కూడా, 'మార్నింగ్ వాక్.. ఈవినింగ్ వాక్' అన్నట్లే వుండేది. అక్రమాస్తుల కేసులో కోర్టు యెదుట వ్యక్తిగత విచారణకు హాజరవ్వాల్సి వున్న వైఎస్ జగన్, దాన్ని తప్పించుకునేందుకు పాదయాత్ర చేశారన్నదీ కాదనలేని వాస్తవం. ఈసారి కూడా అంతేనా.? అంటే, దీనిపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇదిలా వుంటే, పాదయాత్ర అంటే బోల్డన్ని



ఖర్చులుంటాయి. కొంత ఖర్చు పార్టీ పెడితే, ఇంకొంత ఖర్చు స్థానిక నాయకులు పెట్టుకోవాలి. ఇక్కడే, వైసీపీ నేతలు గుస్సా అవుతున్నారు. 2024 ఎన్నికల్లో వైసీపీ నాయకులు తీవ్రంగా నష్టపోయిన మాట వాస్తవం. వై నాట్ 175 అని వైఎస్ జగన్ చెబితే, గుడ్డి నమ్మేసి, అవసరానికి మించి ముందుగా ఖర్చు చేసేసి, చేతులు కాల్చుకున్నారు వైసీపీ నేతలు. ఎన్నికల్లో ఓడిపోయాక, మరిన్ని ఆర్థిక ఇబ్బందులు వైసీపీ నేతల్ని వెంటాడుతున్నారు. ఈ నేపథ్యంలో పాదయాత్ర అంటేనే, ఖర్చు దండగ వ్యవహారం.. అనేస్తున్నారట వైసీపీలో. మరీ, ముఖ్యంగా ఉత్తరాంధ్రకు చెందిన వైసీపీ నేతలు, 'ఖర్చు మా వల్ల కాదు' అని అధినాయకత్వానికి ఆల్రెడీ తేల్చి చెప్పేశారన్నది ఇన్‌సైడ్ సోర్సెస్ నుండి అందుతున్న సమాచారం.

## నాసిరకం పనులు చేసిన కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు పెట్టాలి

**- వైసీపీ హయాంలో రెచ్చిపోయిన అవినీతి తిమింగళాలు**
**- ఇష్టానురీతిగా ప్రజాధన దోపిడీ**
**- కాస్త గాలికే నేలకొరిగిన విద్యుత్ స్తంభం**
**- వైసీపీ హయాంలో జరిగిన పనులపై విజిలెన్స్ దర్యాప్తు చేపట్టాలి**
**- నగరపాలక సంస్థ కమీషనర్ ను కోరిన జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి**



**గుంటూరు, మే 16 (జనస్వరం) :** గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన పలు అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలను గాలికొదిలేశారని, నాసిరకం పనులు చేసిన కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు పెట్టాలని జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి అన్నారు. శుక్రవారం తెల్లవారుజామున వీచిన గాలికి స్థానిక సంపత్ నగర్ రామనామ క్షేత్రం రోడ్డులో నూతనంగా నిర్మించిన విద్యుత్ స్తంభం నేలకొరగటంపై అయన తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. సమయానికి అక్కడ పాదచారులు కానీ వాహనదారులు కానీ ఎవరు లేరు కాబట్టి పెను ప్రమాదం తప్పిందన్నారు. గాలికి పడిపోయేలా నాసిరకం విద్యుత్ స్తంభాలను నిర్మిస్తుంటే అధికారులు, క్వాలిటీ కంట్రోల్ వారు ఏమి చేస్తున్నారని నిలదీశారు. గత పాలకులు, అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కయి కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దోచుకున్నారని విమర్శించారు. వైసీపీ హయాంలో అవినీతి తిమింగళాలు ఇష్టానురీతిగా రెచ్చిపోయాయని, గత పాలనలో జరిగిన పనులపై విజిలెన్స్ దర్యాప్తుకు ఆదేశించాలని ఆళ్ళ హరి కోరారు.

## "ఆపరేషన్ సింధూర్"ను ఎవరు మరచిపోరు

**- జెండా ఊపుతూ అభినందించిన ఏలూరు ప్రజలు**



**ఏలూరు, మే 16 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** ఉగ్రవాదంపై భారత త్రివిధ దళాలు విజయవంతంగా నిర్వహించిన ఆపరేషన్ సింధూర్ విజయాన్ని జాతీయ స్థాయిలో కొనియాడుతున్న నేపథ్యంలో, ఏలూరులో శుక్రవారం భారీగా తిరంగా యాత్ర నిర్వహించారు. భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ప్రజల భాగస్వామ్యంతో జరిగిన ఈ యాత్ర దేశ భద్రతను పరిరక్షించేందుకు ప్రాణాలను సైతం పణంగా పెట్టిన జవాన్ల సాహసానికి నివాళిగా నిలిచింది. బ్రహ్మోస్ అస్త్రాలతో పాక్ ఉగ్రస్థావరాలపై జరిపిన దాడి దేశ ప్రజల గర్వకారణంగా మారిందని, ఈ విజయానికి చిహ్నంగా త్రివిధ దళాలపై ప్రజల మద్దతును చాటేందుకు ఈ ర్యాలీని నిర్వహించినట్లు ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి తెలిపారు. ప్రజలు, యువత, విద్యార్థులు పెద్ద ఎత్తున జాతీయ జెండాలతో పాల్గొనగా, చిన్నారులు ప్రత్యేక వేషధారణలో ముందుండి ఆకట్టుకున్నారు. ఈ యాత్రలో ఆర్టీసీ విజయవాడ జోన్ - 2 చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, ఈడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఏఎంసీ చైర్మన్ మామిళ్ళపల్లి పార్ధసారధి, బీజేపి జిల్లా అధ్యక్షులు చౌటుపల్లి విక్రమ్ కిషోర్, మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ, జనసేన రాష్ట్ర కార్యదర్శి ఘంటసాల వెంకట లక్ష్మి పాల్గొన్నారు. రామకోటి ప్రాంగణం నుండి ప్రారంభమైన ర్యాలీ పాత బస్టాండ్ వరకు సాగి అక్కడ మానవహారం ఏర్పాటు చేశారు.

**దేశ భద్రత కోసం ప్రతిదాడి తగిన సమాధానం : బడేటి చంటి**

"భారతదేశం శాంతిని కోరే దేశం అయినా, దేశ భద్రతకు భంగం కలిగిస్తే ప్రతిదాడికి సమాధానం ఇవ్వగల శక్తి మనకు ఉందని సింధూర్ ఆపరేషన్ నిరూపించింది," బడేటి చంటి అన్నారు. బ్రహ్మోస్ అస్త్రాలతో తొమ్మిది పాక్ ఉగ్రస్థావరాలు ధ్వంసమవ్వడం దేశ ప్రజలందరినీ గర్వపడేలా చేసిందన్నారు. ఈ విజయానికి గుర్తుగా ప్రధాని నరేంద్ర మోదీకి, సైనిక బలగాలకు ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేశారన్నారు.

**పాక్‌కు గుణపాఠం చెప్పిన భారత సైన్యం : అప్పలనాయుడు**

ఆర్టీసీ చైర్మన్ అప్పలనాయుడు మాట్లాడుతూ, "ఇండియాతో పెట్టుకుంటే పాక్ మ్యాప్‌ను ప్రపంచ పటంలో నుంచి తొలగించే స్థాయికి మనం చేరుకున్నాం. మోదీ నేతృత్వంలోని భారత సైన్యం ఆపరేషన్ సింధూర్ ద్వారా దానిని మరోసారి రుజువు చేసింది," అని అన్నారు.


**దేశ సైన్యానికి మద్దతుగా ప్రజల ఐక్యత :**

బీజేపీ జిల్లా అధ్యక్షుడు చౌటుపల్లి విక్రమ్ కిషోర్ మాట్లాడుతూ, "పాక్ ముష్కర మూకల స్థావరాలను నేలమట్టం చేసిన భారత సైన్యం పట్ల దేశ ప్రజలు ముక్తకంఠంతో అభినందనలు తెలియజేస్తున్నారు," అన్నారు. మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ మాట్లాడుతూ, భారత ఆయుధ శక్తిని ప్రపంచానికి చాటి చెప్పిన ఈ విజయానికి త్రివిధ దళాల సైనికులకు, ప్రధాని మోదీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**జాతీయ సమైక్యతకు ప్రతీకగా తిరంగా యాత్ర :**

రాష్ట్రంలో దేశ భద్రత, జాతీయ సమైక్యత పట్ల ప్రజల నిబద్ధతను చాటేందుకు జరిగిన ఈ యాత్రలో ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, యువకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొనడం విశేషంగా నిలిచింది. ఆపరేషన్ సింధూర్ విజయాన్ని ప్రజాసామాన్యంలోకి తీసుకెళ్లే ఈ ప్రయత్నం దేశభక్తికి ఒక గొప్ప నిదర్శనంగా మారింది.

## పుట్టపర్తిలో జాతీయ తిరంగా ర్యాలీ - మినీ మహానాడు



**పుట్టపర్తి, మే 16 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** నియోజకవర్గంలో రెండు ముఖ్యమైన కార్యక్రమాలు జరగనున్నట్లు స్థానిక కూటమి నేతలు తెలిపారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాలకు ఈ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. 17న జాతీయ తిరంగా ర్యాలీ : ఈ నెల 17న సాయంత్రం 4.30 గంటలకు పుట్టపర్తి మున్సిపల్ కార్యాలయం నుంచి విద్యాగిరి ఆర్చ్ వరకు భారీగా జాతీయ తిరంగా ర్యాలీ నిర్వహించనున్నారు. ఈ ర్యాలీలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డా. పల్లె రఘునాథ్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు జి.ఎం. శేఖర్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ పత్తి చంద్రశేఖర్, ఇతర కూటమి నాయకులు పాల్గొననున్నారు. ప్రజలు, కూటమి కార్యకర్తలు, అధికారులు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతీయ జెండాను గౌరవించాల్సిందిగా వారు పిలుపునిచ్చారు. 20న పుట్టపర్తి మినీ మహానాడు : పుట్టపర్తి టీడీపీ క్యాంపు కార్యాలయంలో ఈ నెల 20న మినీ మహానాడు జరగనుంది. ఈ మహానాడుకు ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, పార్టీ నియోజకవర్గ పరిశీలకులు హాజరుకానున్నారు. అన్ని మండలాల కన్వీనర్లు, టీడీపీ అనుబంధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ మంత్రి డా. రఘునాథ్ రెడ్డి పిలుపునిచ్చారు.

## దేశం యావత్తు సైనికుల వెంటే..

**- సైనికుల కోసం "మేము సైతం" అన్న భారతావని.**



**తిరుపతి, మే 16 (జనస్వరం) :** ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు తిరుపతి నగరంలో భారతదేశ సైనికులకు సంఘీభావంగా శుక్రవారం "తిరంగా ర్యాలీ" దేశాభిమానులతో కలసి నిర్వహించారు. తిరుపతి నగరంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ నేతృత్వంలో ఎన్డీఏ కూటమి ఆధ్వర్యంలో బిజెపి, టిడిపి, జనసేన పార్టీ నాయకులు... శ్రేణులు మాజీ సైనికులు, ముస్లిం మైనారిటీలు, సామాజిక వేత్తలు, వస్త్ర వ్యాపారస్తుల సంఘం, పారిశ్రామికవేత్తలు, ప్రజా సంఘాలు యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని "జై జవాన్".... "భారత్ మాతాకీ జై హింద్" అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ భారీ జాతీయ జెండాతో ఎంఆర్ పల్లి సర్కిల్ నుంచి అన్నమయ్య సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నేత నవీన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులను "ఆపరేషన్ సింధూర్" తో ఆడపడుచుల నుదుటున పసుపు కుంకుమలను చెరిపేసిన పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులను, మానవ మృగాలను మట్టికరిపించి ప్రపంచ దేశాలకు భారత్ సైనికుల సత్తాను చాటారని కొనియాడారు. భారత దేశంలో 140 కోట్ల మంది ప్రజలు కంటి నిండా గుండెల పై చేయి వేసుకొని నిద్రపోతున్నారంటే దానికి ప్రధాన కారణం భారత దేశ సరిహద్దులలో మన సైనికులు తమ ప్రాణాలను పణంగా పెట్టి తమ కుటుంబాలకు దూరంగా ఉంటూ దేశ ప్రజలను రక్షిస్తున్నారని వారికి 140 కోట్ల మంది భారతీయులు కుల, మతాలకు, ప్రాంతాలకు అతీతంగా "భారతదేశమంతా మీ వెంటే" అంటూ తిరంగా ర్యాలీ ద్వారా దేశవ్యాప్తంగా సంఘీభావం తెలుపుతున్నారన్నారు. నరేంద్ర మోడీ నాయకత్వంతో ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే ఏ దేశాన్నయినా భారతదేశం ఉపేక్షించదని ఆపరేషన్ సింధూర్ ద్వారా ప్రపంచ దేశాలకు ఓ హెచ్చరిక చేశారన్నారు. ఆపరేషన్ సింధూర్ లో అమరవీరులైన భారత్ సైనికులకు జోహార్లు.... "అమర్ రహే".... అంటూ శ్రద్ధాంజలి ఘటించారు.

## చరిత్రలో నిలిచిపోయేలా తిరంగా ర్యాలీ జయప్రదం చేద్దాం

**- ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)**
**- టీడీపీ పశ్చిమ నియోజకవర్గ నేతలతో సన్నాహక సమావేశం**



**విజయవాడ, మే 16 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** పహల్గాంలో భారతీయులపై పాకిస్తాన్ ఉగ్రవాదుల దాడికి ప్రతీకారంగా భారత సైన్యం విజయవంతంగా నిర్వహించిన "ఆపరేషన్ సిందూర్"ను గుర్తు చేసుకుంటూ, శుక్రవారం సాయంత్రం విజయవాడలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో నిర్వహించబోయే తిరంగా ర్యాలీ దేశ చరిత్రలో నిలిచిపోయేలా జయప్రదం చేయాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) పిలుపునిచ్చారు. ఈ ర్యాలీలో ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొననున్నట్లు ఎంపీ తెలిపారు. శుక్రవారం గురు నానక్ కాలనీలోని ఎంపీ పార్లమెంట్ కార్యాలయం (ఎన్టీఆర్ భవన్)లో తిరంగా ర్యాలీ ఏర్పాట్లపై టిడిపి పశ్చిమ నియోజకవర్గ నాయకులతో ఆయన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ "దేశాన్ని భయపెట్టాలని చూసిన పాకిస్తాన్ ఉగ్రవాద మూకలకు, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత సైన్యం గట్టి బుద్ధిచెప్పింది. మూడు రోజుల్లోనే దేశ శక్తిని ప్రపంచానికి చాటిచెప్పింది. దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన సైనికుల త్యాగాలకు ఘన నివాళిగా నిర్వహించే ఈ తిరంగా ర్యాలీ, జాతీయ ఐక్యతను ప్రతిబింబించేలా ఉండాలి" అని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేష్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎమ్.ఎస్. బేగ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పశ్చిమ నియోజకవర్గ డివిజన్ అధ్యక్షులు, క్లస్టర్ ఇంచార్జిలు, అనుబంధ సంఘాల నాయకులు సమావేశంలో పాల్గొన్నారు.

## "తుడ"ను పరుగులు పెట్టిద్దాం

**- టీడీపీ, జనసేన, బీజేపీ నేతలతో తుడ కొత్త చైర్మన్ డాలర్స్**

**తిరుపతి, మే 16 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** గతంలోలాగా కాకుండా తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడ)ను అన్ని విధాలా అందరి సహకారంతో పరుగులు పెట్టించి సామాన్యులకు కూడా సహాయం అందేలా చేయాలన్నదే తన ఆశయం అని తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడ) కొత్త చైర్మన్ గా నియమితులైన డాలర్స్ దివాకర్ రెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ ఆశయాలు సాధించే దిశగా ఎంపికైన తుడ చైర్మన్ దివాకర్ రెడ్డి శుక్రవారం పలువురు టీడీపీ, జనసేన, బీజేపీ నేతలను కలిసి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. వారిలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, తిరుపతి ఎమ్మెల్యే జంగాలపల్లి శ్రీనివాసులు, తుడ మాజీ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్, టీడీపీ నేత అన్నా రామచంద్ర యాదవ్ బ్రదర్స్, జనసేన సీనియర్ నేత డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, తిరుపతి మున్సిపల్ వైస్ చైర్మన్ ఆర్.సి.మునికృష్ణ, మాజీ సర్పంచ్ సి.ఆర్. రాజన్, బీజేపీ అధికార ప్రతినిధి గుడిపల్లి భానుప్రకాష్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, బీజేపీ నేత పి. నవీన్ కుమార్ రెడ్డి, ఆర్టీసీ మాజీ యూనియన్ నేత బుల్లెట్ రమణ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా నూతన తుడ చైర్మన్ డాలర్స్ దివాకర్ మీడియాతో మాట్లాడుతూ తన లక్ష్యం.. కలిసి పని చేయడమే అని వెల్లడించారు. ఆ దిశగా ఐక్యతతో అడుగులు వేద్దాం అని కూటమి పార్టీ ల నేతలకు విన్నావించ్చారు. గత ఐదేళ్లుగా తుడా తిరోగమనం చెందిందని, తుడాభివృద్ధి లక్ష్యంగా అందరినీ కలుపుకొని ముందడుగు వేస్తానని పేర్కొన్నారు.





## కొత్త రేషన్ కార్డుల నమోదు కార్యక్రమానికి ఘన స్పందన

**- జనసేన యువనేత హుస్సేన్ ఖాన్ ఆధ్వర్యంలో అభ్యర్థనలు స్వీకరణ**

**విజయనగరం, మే 16 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి నగరంలోని 9వ డివిజన్, 11వ సచివాలయంలో ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ యువ నాయకుడు, కార్పొరేటర్ అభ్యర్థి హుస్సేన్ ఖాన్ ప్రత్యక్షంగా పాల్గొని, రేషన్ కార్డులు లేని పేదవారికి అభ్యర్థనలు దాఖలు చేయిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "రేషన్ కార్డు లేని వారు, కొత్తగా కుటుంబ సభ్యులను యాడ్ చేయాలనుకునేవారు, ఇతర సవరణలు అవసరమైన వారు – అందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి. ఈ కార్యక్రమం పూర్తిగా ప్రజల హక్కులను సమర్థించేందుకు కూటమి ప్రభుత్వం తీసుకున్న గొప్ప సంకల్పం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, జనసేన నాయకులు విజయ్, రమణ, భవాని, పందు తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున హాజరై తమ సమస్యలను నమోదు చేసుకోవడం ద్వారా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.




## వేద పాఠశాలల్లో ప్రవేశాల దరఖాస్తులకు టీటీడీ ఆహ్వానం

**తిరుపతి, మే 16 (జనస్వరం):** టీటీడీ ఆధ్వర్యంలో నడుపబడుతున్న వేద పాఠశాలల్లో 2025-26 విద్యాసంవత్సరానికి గాను ప్రవేశాల కోసం అర్హులైన విద్యార్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానించారు. తిరుమల ధర్మగిరిలోని వేద విజ్ఞాన పీఠంతో పాటు కీసరగుట్ట, విజయనగరం, ఐ. భీమవరం, నల్గొండ, కోటప్పకొండ వేదికలపై వేద విద్య బోధించబడుతోంది. వైదిక సంప్రదాయాన్ని పాటిస్తూ ఉపనయనం నిర్వహించిన బాలురే ఈ కోర్సులకు అర్హులు. నిర్ణీత వయస్సు, విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని టీటీడీ అధికారులు సూచించారు. కోర్సుల వివరాలు, అర్హతలు, దరఖాస్తు విధానం మొదలైన వివరాలను టీటీడీ అధికారిక వెబ్‌సైట్ www.tirumala.org ద్వారా తెలుసుకోవచ్చునని పేర్కొన్నారు. దరఖాస్తులు సమర్పించేందుకు చివరి తేదీ 2025 మే 30 అని అధికారులు తెలిపారు.

# సరైన సమయంలో ఖచ్చితమైన నిర్ణయం తీసుకునే సమర్థత ప్రధాని మోదీ సొంతం

**- ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్నీ)**
**- తిరంగా ర్యాలీకి హాజరైన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కు ఘన స్వాగతం**
**- ఉగ్రవాదాన్ని అంతమొందించాలన్నదే మోదీ సంకల్పం**
**- భారత సైన్యం శక్తి సత్తా పాకిస్తాన్‌కు బోధించిందన్న ఎంపీ కేశినేని**

**విజయవాడ, మే 16 (జనస్వరం ప్రత్యేక ప్రతినిధి) :** భారతీయ మహిళలను చులకనగా చూసిన పాకిస్తాన్ ఉగ్రవాదులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమయంలో ఖచ్చితమైన నిర్ణయం తీసుకుని గట్టి బుద్ధి చెప్పారు అని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్నీ) పేర్కొన్నారు. ఉగ్రవాదుల కుట్రలకు చెక్ పెట్టేందుకు చేపట్టిన "ఆపరేషన్ సిందూర్" విజయవంతం కావడాన్ని సందర్భించుకుని, దేశం తరపున పోరాడిన సైనికులకు సెల్యూట్ చేశారు. శుక్రవారం సాయంత్రం విజయవాడలో తిరంగా ర్యాలీ అత్యంత ఉత్సాహంగా జరిగింది. ఆపరేషన్ సిందూర్ విజయాన్ని పట్ల సంఘీభావంగా సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలో, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్, బీజేపీ రాష్ట్రాధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు బొండా ఉమా, గద్దె రమణమోహన్ రావు, కొలికపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి బెంజ్ సర్కిల్ వరకు భారీగా సాగిన ఈ ర్యాలీలో ప్రజలు దేశభక్తి నినాదాలతో మార్మోగించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని మాట్లాడుతూ, దేశ రక్షణ కోసం ప్రాణాలు త్యాగం చేసిన మురళీ నాయక్ వంటి వీరులు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలుస్తారన్నారు. దేశ అభివృద్ధిని చూసి ఓర్వలేక పాకిస్తాన్ ఉగ్రవాదులు పహల్గాంలో కుట్ర పన్నారని, ఇకపై అలాంటి చర్యలకు మరింత గట్టిగా బుద్ధి



చెప్పేందుకు భారత సైన్యం సిద్ధంగా ఉందని హెచ్చరించారు. తిరంగా ర్యాలీలో పాల్గొన్న ప్రజలందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ : చింతల శ్రీనివాసులకు ఘన సన్మానం

**నెల్లూరు, మే 16 (జనస్వరం) :** జిల్లాలోని సీతారామపురం మండలం తెలుగుదేశం పార్టీ నాయకులు చింతల శ్రీనివాసులను ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఘనంగా సన్మానించారు. ఆపరేషన్ సింధూర్ విజయవంతమైన సందర్భంగా వింజమూరులో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన సీతారామపురం మండలం టీడీపీ నాయకులు చింతల శ్రీనివాసులను శాలువా కప్పి, బొకే అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చింతల శ్రీనివాసులు మాట్లాడుతూ పహల్గాం ఉగ్రదాడిలో అమరులైన భరతమాత ముద్దు బిడ్డలకు, ఆపరేషన్ సింధూర్ లో వీరమరణం పొందిన జవాన్లకు జోహార్లు అర్పిస్తూ ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో 100 మీటర్ల జాతీయ జెండాతో, త్రివర్ణ జండాలను చేత భూని, భరతమాత నినాదాలను పలుకుతూ క్రమశిక్షణతో వింజమూరు మండల కేంద్రంలో నిర్వహించిన తిరంగా ర్యాలీ విజయవంతం అయిందని తెలిపారు. ఈ ర్యాలీలో పాల్గొనడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని, ఈ ర్యాలీలో పాల్గొనేందుకు అవకాశం కల్పించిన ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కు చింతల శ్రీనివాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కన్వీనర్ ము త్తంశెట్టి చెన్నకేశవులు, వెంగళ శెట్టి వెంకటేశ్వర్లు, నేలటూరి జాషువా, జెసి ఇజ్రాయిల్, కానాల సిద్దయ్య, పసుపులేటి వికాస్ (విక్కీ), ముత్తూరు సుమన్, కాశీ రత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.



# కళారాధన రజతోత్సవ కార్యక్రమాల వార్షిక ప్రణాళికకు అమలు

**నంద్యాల, మే 16 (జనస్వరం) :** కళారాధన సాంస్కృతిక సంస్థ, నంద్యాల – సర్వసభ్య సమావేశం ఈ నెల 18వ తేదీ ఆదివారం ఉదయం 9 గంటలకు మధుమణి నర్సింగ్ హోమ్ సమావేశ భవనంలో నిర్వహించబడుతుందని సంస్థ అధ్యక్షులు డాక్టర్ మధుసూదన్ రావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవికృష్ణ, ఎస్. ఆర్.ఎస్. ప్రసాద్, రవి ప్రకాశ్, శ్రీకాంత్ తెలిపారు. కళారాధనలో కొత్తగా చేరదలచిన కళాకారులు, కళాభిమానులకు ఈ సమావేశంలో సభ్యత్వం తీసుకునే అవకాశం ఉంది. సభ్యత్వ రుసుము లేదు. ఈ సర్వసభ్య సమావేశంలో రానున్న రెండు సంవత్సరాల కాలానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. కళారాధన స్థాపించబడిన 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా, ఈ నెల నుండి వచ్చే ఏప్రిల్ వరకు సంవత్సరం పాటు రజతోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి ఏడాది నిర్వహించే వేసవి శిక్షణ శిబిరాలు – కళాసాధన, ఆగస్టులో స్వాతంత్ర దినోత్సవం పురస్కరించుకొని నిర్వహించే "మాతృభూమికి కళార్చన" కార్యక్రమాలు, రాష్ట్రస్థాయి నాటకోత్సవాలు, చిత్రలేఖన - చిత్రకళా ప్రదర్శనలు, శాస్త్రీయ సంగీత నృత్య ఉత్సవాలు, కవి సమ్మేళనం, అష్టావధానం, భువన విజయం వంటి సాహిత్య కార్యక్రమాలు పెద్ద స్థాయిలో నిర్వహించేందుకు ఈ సమావేశంలో వార్షిక ప్రణాళిక రూపొందించనున్నట్టు తెలిపారు. కళారాధన సభ్యులు, కళాకారులు,



కళాభిమానులు ఈ సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాల్సిందిగా వారు కోరారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# ఈ నెల 18న నంద్యాలలో తిరంగ యాత్ర

**నంద్యాల, మే 16 (జనస్వరం) :** భారతీయ జనతా పార్టీ పిలుపు మేరకు కూటమి పార్టీలతో కలిసి ఈ నెల 18వ తేదీన నంద్యాలలో తిరంగ యాత్రను అట్టహాసంగా నిర్వహించనున్నట్లు బీజేపీ పట్టణ మాజీ అధ్యక్షుడు ఫిరంగి బ్రహ్మయ్య ఆచారి తెలిపారు. శుక్రవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ, దేశాన్ని రక్షించడంలో అగ్రగాములుగా ఉన్న మన త్రివిధ దళాల సైనికులు ప్రస్తుతం ఆపరేషన్ సింధూర్లో వీరోచితంగా పోరాడుతున్నారని అన్నారు. ఈ సాహసోపేతమైన యుద్ధ త్యాగానికి గౌరవం మరియు మద్దతుగా బీజేపీ, తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ నేతలు మరియు కార్యకర్తలు కలిసి తిరంగ ర్యాలీ చేపడుతున్నామని వెల్లడించారు. ఈ ర్యాలీ ద్వారా మన సైనికులకు మద్దతుగా, ఆత్మీయ సంఘీభావాన్ని ప్రకటించాలనే లక్ష్యంతో ముందడుగు వేస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి మండలానికి చెందిన కూటమి పార్టీల తరపున, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకులు, పార్టీలకతీతంగా సామాన్య పౌరులు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ తిరంగ యాత్రకు నంద్యాల పట్టణంలోని అన్ని వర్తక సంఘాల సభ్యులు, అన్ని కుల సంఘాల నాయకులు, టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు, విద్యా సంస్థల ప్రతినిధులు పాల్గొని యాత్రను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమం ఉదయం 8:00 గంటలకు టెక్కే మార్కెట్ యార్డు నుంచి ప్రారంభమై గాంధీ చౌక్ వరకు కొనసాగుతుందని తెలిపారు. ఆపరేషన్ సింధూర్‌కు మద్దతుగా నిర్వహిస్తున్న ఈ తిరంగ ర్యాలీకి రాజకీయాలకు అతీతంగా ఎటువంటి రాజకీయ నినాదాలు, ప్రసంగాలు లేకుండా, పూర్తిగా స్వచ్ఛందంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు.



# కార్మికులను కట్టు బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

**నంద్యాల, మే 16 (జనస్వరం) :** కేంద్ర ప్రభుత్వం కార్మిక అనుకూల చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్స్‌ను నిర్బంధంగా అమలు చేయడానికి కుట్రలు పన్నుతోందని ఐఎఫ్టియు జిల్లా సహాయ కార్యదర్శి ఎం. శంకర్ విమర్శించారు. లేబర్ కోడ్స్ అమల్లోకి వస్తే, కార్మికులు యూనియన్‌లు స్థాపించే హక్కును కోల్పోతారని, అలాగే సమ్మె చేసే హక్కు కూడా నశించిపోతుందని ఆయన పేర్కొన్నారు. సంఘాల రిజిస్ట్రేషన్ మరియు నిర్వహణ కూడా సంక్షోభంలో పడే ప్రమాదం ఉందన్నారు. ఈ కోడ్స్ వల్ల కార్మికులు పరిశ్రమల యజమానులకు కట్టుబడి బానిసలుగా మారే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇప్పటికే 12 గంటల పని దినాలు అమలులో ఉన్నాయని పేర్కొంటూ, కేంద్ర ప్రభుత్వం లాభదాయకంగా పనిచేస్తున్న ప్రభుత్వ రంగ పరిశ్రమలను తక్కువ ధరకే ప్రైవేట్ కార్పొరేట్ శక్తులకు విక్రయిస్తున్నదని ఆరోపించారు. రైతులు, కార్మికులు, ఉద్యోగులు మరియు ప్రజల వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 20న నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా గోడపత్రికలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్టియు జిల్లా కోశాధికారి ఎస్. చౌడప్ప, ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం నాయకులు రాజు, సురేష్, మౌలాలి,




వర్మయ్య, యు. రాజు, ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, రఫీ, అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకులు శంకరయ్య, దేవదానం తదితరులు పాల్గొన్నారు.

# డెంగ్యూ వ్యాధిపై ప్రజలు అప్రమత్తతే ఆరోగ్యానికి రక్షణ

**- చింతపల్లిలో జాతీయ డెంగ్యూ దినోత్సవ ర్యాలీ.**
**- చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రి సూపరిండెంట్ ఇంద్ర ప్రియాంక.**

**చింతపల్లి, మే 16 (జనస్వరం) :** జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని చింతపల్లి మండల కేంద్రంలోని ఆర్‌వీ నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి కే సౌమ్య ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రి సూపరిండెంట్ డా. ఇంద్ర ప్రియాంక ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఇంటి పరిసరాల పరిశుభ్రతకే డెంగ్యూ నియంత్రణకు కీలక పాత్ర ఉందని తెలిపారు. నీటి గుంతల్లో నిలువనీరు ఉండటం వల్ల దోమలు ఏర్పడి డెంగ్యూ వ్యాధి వ్యాప్తి చెందుతుందన్నారు. ప్రజలు ఆరోగ్యశాఖ సూచనలు ఖచ్చితంగా పాటించాలనీ, జ్వరం లక్షణాలు కనిపించగానే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లి రక్తపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. డెంగ్యూ వ్యాధి నివారణలో ప్రజల భాగస్వామ్యం అవసరమని ఆమె హితవు పలికారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డా. రవీంద్రనాథ్ చౌదరి, ప్రాంతీయ ఆసుపత్రి వైద్యాధికారులు బి లావణ్య, ఎంపీహెచ్ఈఓ జాన్సన్, ఎంపీహెచ్ఎస్ శాంతామణి, ఏఎన్ఎంలు లక్ష్మమ్మ, పెంటా కుమారి, కోపూరు విజయలక్ష్మి, దిబ్బ వెంకట రమణమ్మ, వరలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్లు సత్యారావు, లక్ష్మణరావు, ప్రకాష్, ల్యాబ్ టెక్నీషియన్స్ అనిల్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.




# వరదలు దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాలి – సీపీఎం డిమాండ్

**కూనవరం, మే 16 (జనస్వరం) :** గోదావరి వరదలను దృష్టిలో పెట్టుకొని ముంపు ప్రాంత ప్రజలకు తగిన ఏర్పాట్లు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ డిమాండ్ చేశారు. మండలంలోని శ్రీమార్త శ్రీరాంమూర్తి భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాకాలం రాగానే ముంపు లేని ప్రాంతాల్లో బఫర్ స్టాక్, బియ్యం, నిత్యావసర సరుకులు ముందస్తుగా ఏర్పాటు చేయాలని సూచించారు. వరదల సమయంలో విద్యుత్‌కు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, ముంపు లేని ప్రాంతాల నుండే విద్యుత్ లైన్ వేయాలని తెలిపారు. గతంలో Collector దృష్టికి ముంపు ప్రాంతాల్లో విద్యుత్ సంబంధిత సమస్యలు తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం బాధాకరమని విమర్శించారు. ఈ ఏడాది భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోందని పేర్కొన్నారు. మరోవైపు పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ భయంతో ముంపు ప్రాంత ప్రజలు భయాందోళనలో ఉన్నారని తెలిపారు. అయినా కూడా ప్రభుత్వం ఇప్పటి వరకు సరైన చర్యలు తీసుకోకపోవడం ముంపు ప్రాంత ప్రజల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడమేనన్నారు. జూన్, జూలై నెలల్లోనే ముంపు గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి మండల స్థాయిలో సమీక్షా సమావేశాలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. శబరి పరివాహక గ్రామాల్లో వరదల కారణంగా విద్యుత్ సమస్యలు వస్తున్నాయని, నరసాపురం వరకు ప్రధాన రహదారి మీదుగా విద్యుత్ లైన్ కనెక్టివిటీ తక్షణమే ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సున్నం రాజులు, మేకల నాగేశ్వరరావు, మండల కమిటీ సభ్యులు పాయం సీతారామయ్య, మండల కార్యదర్శి బాబు బొర్రయ్య, మాడెం బాబు, బొగ్గ సుబ్బయ్య, పాయం సత్యనారాయణ, నానుపల్లి వెంకటేశ్వరరావు, ప్రజాప్రతినిధులు సర్పంచ్ సోడా శంకర్, బొగ్గా రామారావు, ఎంపిటిసి ధర్ముల అమ్మాజీ, నాయకులు గడ్డిపాటి షణ్ముఖరావు, గుండం బాబురావు, తాళ్ళూరి శ్రీనివాసరావు, తెల్లం తమ్మయ్య, న్యాయవాది మడివి రవితేజ తదితరులు పాల్గొన్నారు.




## జనస్వరం www.janaswaram.com తెలంగాణ

# కల్తీ నూనె, కల్తీ అల్లం పట్టివేత

**కొడంగల్, మే 16 (జనస్వరం న్యూస్) :** భారీగా కల్తీ నూనె మరియు కల్తీ అల్లం లోడ్ చేసుకొని వెళ్తున్న బొలీరో వాహనాన్ని కొడంగల్ పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ నెల 14న హైదరాబాద్‌లోని కాటేదాన్ నుంచి బయలుదేరిన బొలీరో వాహనం, కల్తీ నూనె మరియు అల్లం తీసుకుని కర్ణాటక వైపు వెళ్తుండగా కొడంగల్ వద్ద అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు వాహనాన్ని తనిఖీ చేశారు. తనిఖీలో 1600 కిలోల కల్తీ అల్లంపేస్ట్ ప్లాస్టిక్ డబ్బాల్లో, 1500 లీటర్ల నూనె బాటిళ్లలో ఉన్నట్లు గుర్తించారు. కల్తీ పదార్థాల అక్రమ రవాణాలో హైమద్, షాబాద్ లు పాల్గొన్నట్లు గుర్తించి వారిపై కేసు నమోదు చేసినట్లు పరిగి డీఎస్పీ ఎన్. శ్రీనివాస్, కొడంగల్ సీఐ శ్రీధర్ రెడ్డి, ఎస్సై జివి. సత్యనారాయణ తెలిపారు.






# కొత్తగూడెం అంగన్వాడీ కేంద్రంలో కిశోర వికాసం వేసవి శిబిరం

**దెందులూరు, మే 16 (జనస్వరం) :** ఐసిడిఎస్ పెదపాడు ప్రాజెక్టు పరిధిలో గల దెందులూరు మండలం పోతునూరు సెక్టార్ లోని కొత్తగూడెం అంగన్వాడీ కేంద్రంలో కిషోర వికాసం వేసవి సెలవుల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌమార దశలో రక్తహీనత బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి సెషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సచివాలయం జి ఎం ఎస్ కె సిహెచ్ శిరీష, సచివాలయం ఏ ఎన్ ఎం యు చాముండేశ్వరి, అంగన్వాడి కార్యకర్తలు ఎన్, ఝాన్సీ రాణి, సిహెచ్ మణి సహాయకులు ధనలక్ష్మి, వరలక్ష్మి డిసిపియు యూనిట్ స్టాఫ్ ఎస్, సునీత, సి హెచ్ మాధవి సెక్టార్ సూపర్వైజర్ కిషోర్ బాలికలు పాల్గొన్నారు.



# కన్నతండ్రిని కడ తేర్చిన తనయుడు

**దెందులూరు, మే 16 (జనస్వరం) :** మండలంలోని ఉండ్రాజవరం గ్రామంలో అంబళ్ల సింహాచలం(72) పై అతని పెద్ద కుమారుడు రోకలి బండతో దాడి చేయడంతో సింహాచలం అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల వివరాలు ప్రకారం సింహాచలానికి ఇద్దరు కుమారులు. మద్యానికి బానిసైన పెద్ద కుమారుడు సన్యాసిరావు తరచూ తండ్రితో గొడవ పడేవాడని శుక్రవారం సాయంత్రం ఇంటి వద్ద తండ్రితో గొడవపడి రోకలిబండతో దాడి చేయడంతో సింహాచలం అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.



## కళారాధనలో... నృత్యప్రదర్శన!

**శ్రీశైలం, మే 16 (జనస్వరం) :** శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నిర్వహించిన సంప్రదాయ నృత్యప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. శ్రీ స్వామి, అమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని, అలాగే ప్రాచీన సంప్రదాయ కళల పరిరక్షణ లక్ష్యంగా ఆలయ దక్షిణ మాడ వీధిలోని ధర్మపథం వేదికపై ఉదయశ్రీ నృత్య అకాడమీ, హైదరాబాద్ వారు సంప్రదాయ నృత్యప్రదర్శనను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భో శంభో, దేవీస్తుతి, మూషికవాహన, లింగాష్టకం, మహిషాసుర మర్దిని తదితర భక్తిగీతాలకు ఉదయశ్రీ, హర్షితశ్రీ తదితరులు నృత్యప్రదర్శన చేశారు. ఈ నిత్య కళారాధన కార్యక్రమంలో ప్రతిరోజూ హరికథ, బుర్రకథ, సంప్రదాయ నృత్యాలు, వాయిద్య సంగీతం, భక్తిరంజని వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారని దేవస్థానం అధికారులు తెలిపారు.




## పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

**బొంరాస్ పేట, మే 16 (జనస్వరం) :** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మండల వైద్యాధికారి హేమంత్ కుమార్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాలలో ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా డెంగ్యూను నిరోధించవచ్చని తెలిపారు. డెంగ్యూవల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించి, అవగాహన కల్పించాలని ఆశ వర్కర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది రాజేశ్వరి, పకీరప్ప, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.




## ఎమ్మెల్సీ రామగోపాల్ రెడ్డిని కలిసిన డిసిసిబి చైర్మన్

**పులివెందుల మే 16 (జనస్వరం) :** శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డిని పులివెందులలోని నివాసం నందు కడప జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ గా ఇటీవల నియమితులైన బి సూర్యనారాయణ రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాసన మండలి సభ్యులు భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డిని చైర్మన్ సత్కరించారు. త్వరలో కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించబోతున్న సూర్యనారాయణ రెడ్డి సత్కరించి శాసనమండలి సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.



## దివ్యాంగులకు అంత్యోదయ కార్డులు ఇవ్వాలి



**పులివెందుల మే 16 (జనస్వరం) :** దివ్యాంగులకు వివాహంతో సంబంధం లేకుండా ప్రత్యేకంగా వారికి పౌర సరఫరాల శాఖ 35 కిలోల రేషన్ కార్డులు మంజూర చేయాలని వైఎస్ఆర్సిపి పులివెందుల నియోజకవర్గ అధ్యక్షులు చాగలేటి భాస్కర్ కోరారు. వయసుతో సంబంధం లేకుండా ఒంటరి దివ్యాంగులకు కూడా అంత్యోదయ సింగల్ రేషన్ కార్డ్ ఇవ్వాలన్నారు. ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తున్న నేపథ్యంలో దివ్యాంగులకు ఈ రకమైన అవకాశం ప్రత్యేకంగా కంప్యూటర్లో కల్పించాలన్నారు. ఈ విషయంపై ప్రభుత్వం ఆలోచన చేసి వెంటనే ప్రత్యేక ఆదేశాలు చేయాలని ఆయన కోరారు.






# ఘనంగా తనకల్లులో జాతీయ డెంగ్యూ దినోత్సవం

**తనకల్లు, మే 16 (జనస్వరం న్యూస్) :** శుక్రవారం తనకల్లు మండలం కోక్కంటి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని తనకల్లు CHC (సామాజిక ఆరోగ్య కేంద్రం)లో డాక్టర్ లోకేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తనకల్లు ఆరోగ్య కేంద్రానికి చెందిన డాక్టర్లు భాస్కర్ నాయక్, షణ్ముఖ ప్రియా, అలాగే కొక్కంటి ఆరోగ్య సిబ్బంది, తనకల్లు CHC వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ప్రత్యేకంగా కదిరి మలేరియా సబ్ యూనిట్ నుండి సూపర్వైజర్ మహబూబ్ బాషా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ లోకేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, డెంగ్యూ జ్వరం "ఏడిస్ ఈజిప్టి" అనే దోమ కాటు ద్వారా వ్యాపించుతుందని వివరించారు. ఈ వ్యాధి చాలా ప్రమాదకరమైందని, మూడు రకాలుగా ప్రభావితం చేస్తుందని చెప్పారు: డెంగ్యూ ఫీవర్, డెంగ్యూ హేమోరాజిక్ ఫీవర్, డెంగ్యూ షాక్ సింగ్రోమ్. డెంగ్యూ దోమలు ఎక్కువగా ఇంటి చుట్టుపక్కల నిల్వ ఉండే నీటిలో పెరుగుతాయని, అందువల్ల పరిసరాల పరిశుభ్రత అత్యంత అవసరమని సూచించారు. ప్రజలందరూ "3 C's" ఫార్ములా పాటించాలని కోరారు Check (పరిశీలించండి) Clean (శుభ్రపరచండి) Close (మూతపెట్టండి) ఈ కార్యక్రమంలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు వైద్య సిబ్బంది మానవహారం ఏర్పాటు చేశారు. పాల్గొన్నవారిలో డాక్టర్లు భాస్కర్ నాయక్, షణ్ముఖ ప్రియ, డాక్టర్ లోకేశ్వర్ రెడ్డి, మలేరియా సబ్ యూనిట్ సూపర్వైజర్ మహబూబ్ బాషా, పిహెచ్సి సూపర్వైజర్లు సూర్యనారాయణ రెడ్డి, సావిత్రమ్మ, హెల్త్ అసిస్టెంట్ జి. ముసల్ రెడ్డి, ANMలు అనురాధ, సఫియా, ఉమాదేవి, హసీనా, ఆశా కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# ఎయిడ్స్ నియంత్రణపై పెదవలస వారపు సంతలో కళాజాతర

చింతపల్లి/జీకే వీధి, మే 16 (జనస్వరం): ఎయిడ్స్ వ్యాధి పై అవగాహన పెంచే ఉద్దేశ్యంతో ఏపీ ఎస్సీఎస్ ఆధ్వర్యంలో జీకే వీధి మండలంలోని పెదవలస వారపు సంతలో కళాజాత కార్యక్రమం నిర్వహించామని పేదవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి కోమలి తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ నాగ సాయి కళాబృందం (పాడేరు) వీధినాటకాలు, పాటల ద్వారా హెచ్ఐవి వ్యాప్తి మార్గాలు, హెచ్ఐవి యాక్ట్ 2017, 1097 హెల్ప్ లైన్ ప్రాముఖ్యత, ఐసిటిసి కౌన్సిలింగ్, ఏఆర్టి మందుల వినియోగం వంటి అంశాలపై ప్రజలకు చైతన్యం కలిగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్ఐవి నిర్ధారణ పరీక్షలు ప్రతి ఒక్కరు తప్పనిసరిగా చేయించుకోవాలి. ప్రారంభ దశలో చికిత్స తీసుకుంటే ఆరోగ్యంగా జీవించవచ్చునని అన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి పృద్విష, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్. శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ ఆనంద్, ల్యాబ్ టెక్నీషియన్ రమాదేవి, ఏఎన్ఎంలు, ఆసుపత్రి సిబ్బంది, ఎస్వీడిఎస్ సభ్యులు, దిశ సంస్థ ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.



# బాలికల ఆరోగ్యం—భవిష్యత్తు బలంగా ఉండే పోషకాహారం కీలకం

**చింతపల్లి, మే 16 (జనస్వరం) :** మండలంలోని సిరిపురం గ్రామంలో కిషోర్ వికాసం సమ్మర్ క్యాంపెయిన్ కార్యక్రమాన్ని ఐసిడీఎస్ ప్రాజెక్ట్ అధికారిణి శ్రీమతి జి. వెంకటరమణి ఆధ్వర్యంలో నిర్వహించారు. వేసవి సెలవుల నేపథ్యంలో బాల బాలికల ఆరోగ్యంపై దృష్టి సారిస్తూ, రక్తహీనత నివారణకు సంబంధించి అవగాహన కల్పించే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు రక్తహీనత వంటి సమస్యల బారిన పడకుండా ఉండేందుకు పోషకాహారం, పరిశుభ్రత, మరియు సమయానికి వైద్యపరీక్షలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రోటీన్, ఐరన్, విటమిన్లు సమృద్ధిగా ఉండే ఆహారం తీసుకోవాలని సూచించారు. కిషోర్ వికాసం, ఐసిడీఎస్, ఆరోగ్య శాఖల సమన్వయంతో నిర్వహించిన, ఈ సందర్భంగా బాలబాలికల మధ్య ఆరోగ్యపరమైన చర్చలు నిర్వహించడంతోపాటు, వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించే దిశగా ఉత్సాహాన్నిచ్చే కార్యకలాపాలు కూడా చేపట్టారు. ఈ కార్యక్రమంలో అదనపు ప్రాజెక్ట్ అధికారిణి ఎం. రామలక్ష్మి, సూపర్వైజర్లు గౌరీ, అప్పల నర్సమ్మ, విజయ కుమారి, గౌహరున్నీషా, అంగన్వాడి కార్యకర్తలు, గ్రామ పెద్దలు, తల్లిదండ్రులు, పిల్లలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# శాశ్వతంగా గ్రామదేవతకు విశేష పూజలు..!
# వైభవంగా స్వామివార్లకు ఊయల సేవోత్సవం..!

**శ్రీశైలం, మే 16 (జనస్వరం) :** శ్రీశైలం క్షేత్రానికి గ్రామదేవత అయిన శ్రీ అంకాళమ్మ అమ్మవారికి విశేష అలంకారం, విశేష పూజలు నిర్వహించగా, అదేవిధంగా ఆదిదంపతులైన శ్రీ భ్రమరాంభ మల్లికార్జున స్వామివార్లకు ఊయల సేవోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రతి శుక్రవారం ఉదయం గ్రామదేవత అమ్మవారికి దేవస్థానం సేవలలో భాగంగా అభిషేకం, విశేష పుష్పాలంకరణ, కుంకుమార్చన, విశేష పూజలను శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నామని కార్యనిర్వాహణాధికారి ఎం. శ్రీనివాసరావు తెలిపారు. శ్రీశైలం క్షేత్రానికి గ్రామదేవతగా భావించబడుతున్న అంకాళమ్మ ఆలయం, ప్రధాన దేవాలయానికి ఎదురుగా ఉన్న రహదారి చివర కుడివైపున ఉత్తరముఖంగా వెలుగొందుతోంది. ప్రకృతి శక్తుల కళలే గ్రామదేవతలని, ఈ ప్రకృతి అంతా ఆదిపరాశక్తి స్వరూపమేనని దేవీ భాగవతంలో పేర్కొనబడిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమం నిర్విఘ్నంగా సాగేందుకు ముందుగా మహాగణపతి పూజ నిర్వహించి, లోక కల్యాణాన్ని కోరుతూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించి అమ్మవారికి విశేష పూజలు



సమర్పించారు. భక్తులు అమ్మవారి విశేష పూజలను భక్తిభావంతో దర్శించుకున్నారు. అదే విధంగా ప్రధాన ఆలయంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను సాయంత్రం వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన ఊయలలో ఆసీనులుగా కూర్చోబెట్టి, శాస్త్రోక్తంగా విశేష పూజలు నిర్వహించి, వైభవంగా ఊయల సేవతో ప్రత్యేక హారతులు సమర్పించారు.



## ప్రమాదవశాత్తు మృతి చెందిన వ్యక్తి కుటుంబ సభ్యులకు 20 లక్షలు రూపాయలు భీమా చెక్కు అందజేత

**పాయకరావుపేట, మే16 , జనస్వరం :** మండలంలోని పాల్తేరు గ్రామానికి చెందిన కొంకిపూడి నాగేశ్వరరావు 2023 డిసెంబరు 29 న కందిపూడి చెరువు వద్ద భారీ క్రేన్ ఢీకొన్న ప్రమాదంలో మృతి చెందాడు. కొంకిపూడి నాగేశ్వరరావుకు పట్టణంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు (మెయిన్) లో సేవింగ్ అకౌంట్ ఉంది. ఈ ఖాతా ద్వారా ఎస్ బి ఐ జనరల్ ఇన్స్యూరెన్స్ లో 1000 రూపాయలు చెల్లించి ప్రమాద భీమా పాలసీ తీసుకున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు మరణించిన నాగేశ్వరావు కుటుంబానికి భీమా సొమ్ము 20,0000 లక్షలు రూపాయలు మంజూరయ్యాయి. ఈ ఇన్స్యూరెన్స్ సొమ్మును శుక్రవారం పట్టణంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులో జరిగిన ఒక కార్యక్రమంలో కొంకిపూడి నాగేశ్వరరావు భార్య కొంకిపూడి పద్మావతి (నామినీ) కి 20 లక్షలు రూపాయలు చెక్కును ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు అనకాపల్లి రీజనల్ మేనేజరు ఎస్ సతీష్ చంద్ర అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ బి ఐ జనరల్ ఇన్స్యూరెన్స్ ఏరియా మేనేజరు జి సురేష్ బాబు, అనకాపల్లి జిల్లా నోడల్ ఆఫీసర్ ఎమ్ మోహన్ రెడ్డి, బ్రాంచి మేనేజరు ఎన్ రాజ్ కుమార్, ప్రమాదవశాత్తు మృతి చెందిన కొంకిపూడి నాగేశ్వరరావు కుటుంబ సభ్యులు, అధిక సంఖ్యలో బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.




## అన్నవరంలో ఇద్దరు మహిళా దొంగలు అరెస్ట్
### - 60 గ్రాముల బంగారం, 1,50 వేల నగదు స్వాధీనం

**శంఖవరం, మే 16, (జనస్వరం) :** ప్రయాణీకుల దృష్టిని ఏమార్చి బంగారం, సొమ్ములు దొంగిలిస్తున్న ఇద్దరు మహిళా దొంగలను అన్నవరం పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ప్రత్తిపాడు సిఐ బి సూర్య అప్పారావు అన్నవరం పోలీస్ స్టేషన్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. జిల్లా ఎస్పీ బిందు మాధవ్ బస్సులలో జరుగుతున్న చోరీలను అరికట్టాలని ఆదేశించారు. ఈ మేరకు పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు ఆధ్వర్యంలో ప్రత్తిపాడు సిఐ సూర్య అప్పారావు, అన్నవరం ఎస్సై శ్రీహరిబాబు రెండు బృందాలుగా ఏర్పడి, నిత్యం రద్దీగా ఉండే అన్నవరం బస్టాండ్ చేరుకున్నారు. ప్రయాణికుల దృష్టిని మరల్చి చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు మహిళా దొంగలను పట్టుకున్నారు. చోరీలకు పాల్పడుతున్న నిందితులు విజయవాడకు చెందిన నక్క వెంకటలక్ష్మి, నక్క మంగ అలియాస్ జంగాల మంగ గా గుర్తించారు. వీరి వద్ద నుండి 60 గ్రాముల బంగారం, 1లక్ష 50 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సిఐ సూర్య అప్పారావు మాట్లాడుతూ బస్సులలో ప్రయాణం చేసేటప్పుడు ఈ దగ్గరలో ఉంటూ ఈ దృష్టిని మరల్చి బంగారం నగదు దొంగిలించే దొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వేసవి సెలవుల్లో ఊరి విడిచి తాళం ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లేవారు మీ సమీపంలోని పోలీస్ స్టేషన్కు సమాచారం ఇవ్వాలని సూచించారు. మహిళా దొంగలను పట్టుకున్న పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ బిందు మాధవ్ అభినందించారు.



Owned by : Sake Naresh (Chairman) - 9642067900, Managed by : Jammu Sai Kalyan (Managing Director) - 7013030690,
REGD NO :APTEL 16144, Mail Id : janaswaramnews@gmail.com Dr.no : 9-35-4A, Illipilli Narasimha Rao Street, Opp KBN College, Kothapeta, Vijayawada - 520001.

# డెంగ్యూ వ్యాధిపై అవగాహన ర్యాలీ



**పులివెందుల మే,16 (జనస్వరం) :** డెంగ్యూ వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించినట్లు తాళ్లపల్లి పిహెచ్సి వైద్యురాలు డా.లక్ష్మీప్రియా వెల్లడించారు. శుక్రవారం జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు డెంగ్యూ వ్యాధి నివారణకు ర్యాలీ నిర్వహించారు. డెంగ్యూ ని ఓడించండి, పరిశీలించండి, శుభ్రం చేయండి.. మూతలు పెట్టండి అనే అంశాలపై ఆరోగ్య సిబ్బంది నినాదాలు చేశారు. అనంతరం డా.లక్ష్మీప్రియా మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి రాకుండా, దోమలు కుట్టకుండా ప్రతి ఒక్కరూ దోమ తెరలు వాడాలన్నారు. రానున్న వర్షకాల నైపథ్యంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేశారు. ఇంటి ఆవరణలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, డ్రైడే పాటించాలని కోరారు. నీటి కుంటల్లో గాంబుజీయా చేపలు వేయించుకోవాలని, ఆకస్మిక జ్వరం విపరీతమైన కండరాలు, కీళ్లు, కళ్ల నొప్పులు, వాంతులు డెంగ్యూ వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే పరిక్షలు చేయించు కోవాలన్నారు. పరిసరాల పారిశుద్ధ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యూకేటర్ షఫిఉన్నిషా, సిహెచ్ఓ వెంకటరత్నం, సూపర్వైజర్లు ఫకృద్దీన్, వెంకటలక్ష్మి, అరుణాదేవి, అంకయ్య, ఏఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.

# తూపల్లెలో ఆగిపోయిన రోడ్డు పనులు

- రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు
- అవస్థలు పడుతున్న ప్రజలు



**పులివెందుల మే 16 (జనస్వరం) :** వేంపల్లి మండలంలోని అలిరెడ్డిపల్లె పంచాయతీ పరిధిలోని తూపల్లెలో రోడ్డు పనులు నిలిచి పోయాయి. దీంతో కురిసిన కొద్దిపాటి వర్షానికే రోడ్డుపై మడుగుల వర్షపు నీరు నిలిచి పోయింది. రోడ్డుపై వర్షపు నీరు నిలిచి పోవడంతో అ రహదారిలో వెళ్లే రైతులు, ప్రజలు అవస్థలు పడుతూ వర్షపు నీటిలోనే నడుస్తున్నారు. కొన్ని ఎళ్లు నుండి తూపల్లె గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వద్ద వర్షపు నీరు నిల్వ ఉండడంతో సిమెంట్ వేయాలని టిడిపి నేతలు ఎమ్మెల్సీని కోరడంతో రూ 10 లక్షలతో సిమెంట్ రోడ్డు వేసేందుకు నిధులు మంజూరు చేయడం జరిగింది. దీంతో సిమెంట్ రోడ్డు పనులు చేసేందుకు కంకరను కూడ తొలి పనులు చేసేందుకు సిద్ధం చేశారు. అయితే టిడిపికి చెందిన మరో వర్గం నేతలు రోడ్డు పనులు జరగకుండా అడ్డుకున్నారు. దీంతో రోడ్డు పనులు జరగకుండా నిలిచి పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల వద్ద వర్షపు నీరు నిల్వ ఉండడంతో పాఠశాలలు తెరిచిన తర్వాత విద్యార్థులు కూడ మురికి నీటిలోనే పాఠశాలలకు వెళ్లాల్సిన పరిస్థితి వస్తుంది. పాఠశాల వద్ద వర్షపు నీరు నిల్వ లేకుండా ఉండేందుకు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులకు ఇబ్బందులు తొలిగేందుకు సిమెంట్ రోడ్డు వేస్తే బాగుంటుందని అ గ్రామంలోని మరి కొందరు అంటున్నారు. ఏది ఏమైనప్పటికి వర్గ పోరుతో అరకొరగా జరుగుతున్న అభివృద్ధి పనులకు చెందిన సిమెంట్ రోడ్డు పనులు అగి పోవడం జరిగింది.

# జగన్ చెప్పాడంటే చేస్తాడంతే...

- మురళీనాయక్ కుటుంబానికి మాజీ మంత్రి ఉషశ్రీ పరామర్శ
- 25 లక్షల సాయం అందజేత

**పులివెందుల మే 16 (జనస్వరం) :** వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి చెప్పిన మాట ప్రకారం వీర జవాన్ మురళీ నాయక్ కుటుంభానికి జగన్ తరుపున మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ రూ.25లక్షలు సహాయం శుక్రవారం అందజేశారు. ఆ మేరకు చెక్కును మురళీ నాయక్ స్వగ్రామం కల్లితండలో ఆమె నాయక్ కుటుంబానికి అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గతంలో జగన్ మురళీ నాయక్ కుటుంబాన్ని పరామర్శించి వైసీపీ తరుపున 25లక్షలు సహాయం ప్రకటించారన్నారు. .పెనుగొండ నియోజక వర్గానికి చెందిన మురళీ నాయక్ పాకిస్తాన్,భారత్ మధ్య యుద్ధం జరుగుతున్న సమయంలో వీరోచితంగా పోరాడి మరణం పొందారన్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం తరుపున రూ.50లక్షలు,పవన్ కళ్యాణ్ రూ. 25 లక్షలు తన సొంత డబ్బు అందిస్తానని ప్రకటించారన్నారు. అయితే ఇప్పటి వరకు ప్రభుత్వం తరుపున కానీ,పవన్ కళ్యాణ్ తరుపున కానీ మురళీ నాయక్ కుటుంబానికి సాయం




అందలేదని ఆరోపించారు. వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి తరుపున మురళీ నాయక్ కుటుంబానికి సాయం అందించామన్నారు. జగన్ మాట తప్పరని నిరూపించుకున్నారని తెలిపారు.

# వీరాంజనేయ స్వామివారిని దర్శించుకున్న కలెక్టర్ చెరుకూరు శ్రీధర్



**పులివెందుల మే 16 (జనస్వరం) :** పులివెందుల నియోజకవర్గం చక్రాయపేట మండలం క్షేత్రంలో వెలసిన స్వామి వారిని కలెక్టర్ చెరుకూరు శ్రీధర్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా విచ్చేసినకలెక్టర్ కు అధికారులు పలికారు. ఈ సందర్భంగా ఆంజనేయ స్వామి విశిష్టత, చరిత్ర తదితర వివరాలను కలెక్టర్కు వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఎండోమెంట్స్ అధికారి శ్రీ జి.మల్లికార్జున ప్రసాద్, దేవస్థానము చైర్మన్ కావలి క్రిష్ణా తేజ, మాజీ చైర్మెన్ కల్లూరు వెంకట స్వామి, పాలక మండలి సభ్యులు, వేంపల్లి మండల తహశీల్దారు వై.హరినాథ్ రెడ్డి, చక్రాయపేట వేంపల్లి జెడ్పి టిసి సభ్యులు టి.శివ ప్రసాద్ రెడ్డి, శ్రీ ఎమ్. రవికుమార్ రెడ్డి, టీబి కాల్వ చైర్మెన్ శ్యామ్రెడ్డి జోగిరెడ్డి, చక్రాయపేట ఎంపిటిసి సభ్యులు మాధవి బాలకృష్ణ, మారెళ్ళ మడక గ్రామ సర్పంచ్ నరసింహులు, బిజెపి నేత గాలి హరి ప్రసాద్, దేవస్థానము ప్రధాన అర్చకులు వి.కేసరి, ఉప ప్రధాన అర్చకులు వి.రాజు రమేష్ ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నరన్నారు.

# చిన్నారి సుంకర నవనీని అభినందించిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్

**అనంతపురం, మే 16, జనస్వరం :** రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం గుత్తిలో ఏర్పాటుచేసిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఆసక్తకర సన్నివేశం చోటుచేసుకుంది. కేంద్రీయ విద్యాలయ అనంతపురం శాఖలో మూడవ తరగతి చదువుతున్న విద్యార్థి సుంకర నవని మంత్రిని మెప్పించారు. ఈ సందర్భంగా సుంకర నవని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు తాను నిర్వహిస్తున్న "ఏక్ పెడ్ మాకే నాం" కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటు కార్యక్రమాన్ని వివరించారు. ప్రభుత్వ స్కూళ్ల, కాలేజీలు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో ప్రతి ఆదివారం, ఇతర సెలవు దినాలలో మొక్కలు నాటడం హాబీగా పెట్టుకుని ఇప్పటివరకు 117 మొక్కలను నాటినట్లు చిన్నారి వివరించారు. అలాగే దాదాపు 1300 మొక్కలను తన తోటి మిత్రులకు, అనేక సామాజిక సేవా కార్యక్రమాల్లో పంపిణీ చేసినట్లు తెలిపారు. అంతేగాకుండా ట్రీ గార్డ్ ఫండ్ కోసం పొదుపు చేసిన హుండీని మంత్రి నారా లోకేష్ కు అందజేశారు. ఈ హుండీని మంత్రి తిరిగి చిన్నారికి ఇస్తూ, ఇంకా ఫండ్ వసూలు చేయమని సూచించారు. మొక్కల సంరక్షణకు స్వయంగా వాడుకోమని ప్రోత్సహించారు. అలాగే చిన్న వయసులోనే ప్రకృతిపై, పర్యావరణ పరిరక్షణ




పట్ల సామాజిక స్పృహ కలిగి ఉండడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో విద్యార్థిని అనేక మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. ఈ బృహత్కర కార్యక్రమానికి సహకరిస్తున్న చిన్నారి నవని తల్లిదండ్రులను, గురువులను మంత్రి లోకేష్ ప్రత్యేకంగా అభినందించారు.

# అంబేద్కర్ విగ్రహానికి వాసగిరి మణికంఠ 15 సిమెంట్ బస్తాలు విరాళం

**గుంతకల్, మే 16, జనస్వరం :** గుంతకల్ మండలంలోని జి.కొట్టాల (కమ్మకొట్టల) గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ నాయకులు నరసింహులు గారు, అదే గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు మరియు గుంతకల్ నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త వాసగిరి మణికంఠ గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేయవలసిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం కోసం గ్రామస్థుల సహకారంతో పునాది వేసిన విషయం తెలిపారు. విగ్రహ నిర్మాణానికి అవసరమైన సిమెంట్, రేగడి, ఇతర సామగ్రి కోసం దాతల సహాయంతో ముందుకెళ్లాల్సిన అవసరముందని, అందులో భాగంగా ఆయన సహాయం కూడా అవసరమని పేర్కొన్నారు. ఈ విజ్ఞప్తిని వినగానే, వాసగిరి మణికంఠ గారు తమ వంతు బాధ్యతగా వెంటనే స్పందించి 15 సిమెంట్ బస్తాలను విరాళంగా అందించారు. ఆయన చేసిన ఈ సేవా సహకారానికి నరసింహులు గారు, గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. మరింత హర్షదాయకంగా, మణికంఠ గారిని వారి స్వగృహానికి ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. గ్రామ అభివృద్ధిలో పాలుపంచుకుంటున్న నాయకులకు అంబేద్కర్ స్ఫూర్తితో మరింత ప్రజాప్రయోజన కార్యక్రమాలు చేయాలన్న ఆకాంక్షను వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామస్థుల్లో స్ఫూర్తి నింపబడిందని, సమాజంలో ఐక్యత మరియు సేవా భావన పెంపొందాలని నాయకులు పేర్కొన్నారు.



# ఇదే జరిగితే... పాకిస్థాన్ లో తీవ్ర సంక్షోభమే!

భారత్, పాకిస్థాన్ మధ్య ఇప్పటికే ఉద్రిక్తంగా ఉన్న సంబంధాలు మరింత క్షీణించే సూచనలు కనిపిస్తున్నాయి. సింధు నదీ జలాల వ్యవస్థ నుంచి తమ వాటా నీటి వినియోగాన్ని గణనీయంగా పెంచుకోవాలని భారత్ యోచిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ చర్య కార్యరూపం దాల్చితే, దాయాది దేశం పాకిస్థాన్‌కు వెళ్లే నీటి సరఫరా భారీగా తగ్గే అవకాశం ఉంది. జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఏప్రిల్ 22న పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదులు జరిపిన ఘోర దాడి నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ దాడిలో పలువురు అమాయకులు ప్రాణాలు కోల్పోయిన కొద్ది రోజులకే, ఇరు దేశాల మధ్య చారిత్రాత్మకంగా సింధు, దాని ఉపనదుల నీటి వినియోగాన్ని నియంత్రిస్తున్న సింధు జలాల ఒప్పందం (IWT)లో తన భాగస్వామ్యాన్ని భారత్ నిలిపివేసింది. మే ప్రథమార్థంలో ఇరుదేశాల సరిహద్దుల్లో తీవ్ర ఉద్రిక్తతల అనంతరం కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ, సింధు జలాల ఒప్పందం విషయంలో భారత్ తన వైఖరిని మార్చుకోలేదని, భారత నీటి ప్రాజెక్టులు ప్రణాళిక ప్రకారమే ముందుకు సాగుతున్నాయని అంతర్జాతీయ వార్తా సంస్థ రాయిటర్స్ నివేదించింది. భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు పూర్తి కావడానికి సంవత్సరాలు పట్టొచ్చు, కానీ ఈ విషయంలో భారత్ పంపుతున్న రాజకీయ సంకేతాలు, నీటి ప్రవాహంపై ప్రాథమికంగా పడే ప్రభావాలు ఇప్పటికే గణనీయంగా ఉన్నాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. దీంతో, భారత్-పాకిస్థాన్ మధ్య నీరు ఒక కొత్త వివాదాంశంగా మారే ప్రమాదం పొంచివుంది.

వ్యూహాత్మకంగా, సింధు నదీ వ్యవస్థ నుంచి, ముఖ్యంగా ఒప్పందం ప్రకారం పాకిస్థాన్‌కు కేటాయించిన చీనాబ్, జీలం, సింధు నదుల నుంచి నీటి వినియోగాన్ని వేగవంతం చేయాలని భారత్ ప్రణాళికలు రచిస్తోంది. ఇందులో అత్యంత కీలకమైన ప్రాజెక్టుగా చీనాబ్ నదిపై ఉన్న రాన్‌బీర్ కాలువ విస్తరణను పరిగణిస్తున్నారు. 19వ శతాబ్దంలో నిర్మించిన ఈ కాలువ ప్రస్తుతం సుమారు 60 కిలోమీటర్ల పొడవు ఉండగా, దీనిని ఏకంగా 120 కిలోమీటర్లకు విస్తరించాలని ప్రతిపాదించారు. ఈ విస్తరణ ద్వారా సెకనుకు 40 క్యూబిక్ మీటర్ల (క్యూమెక్కులు) నీటిని మళ్లించే ప్రస్తుత సామర్థ్యం నుంచి 150 క్యూమెక్కులకు పెంచుకోవచ్చు. ఇది కార్యరూపం దాల్చితే, పాకిస్థాన్‌లోని కీలక వ్యవసాయ ప్రాంతమైన పంజాబ్ ప్రావిన్స్‌కు వెళ్లే నీటి ప్రవాహం గణనీయంగా తగ్గుతుంది. ఇవేకాకుండా, దిగువకు వెళ్లే నీటి లభ్యతను మరింత తగ్గించేలా ఇతర సాగునీటి, జలవిద్యుత్ ప్రాజెక్టులను కూడా భారత్ చురుగ్గా పరిశీలిస్తోంది. సింధు, జీలం, చీనాబ్ నదుల నుంచి నీటిని ఉత్తర భారత రాష్ట్రాల్లోని ఇతర నదుల్లోకి మళ్లించే ప్రతిపాదనలు కూడా ఉన్నాయని రాయిటర్స్ సమీక్షించిన ప్రభుత్వ పత్రాలు సూచిస్తున్నాయి. ఒప్పందంలోని పరిమితుల కారణంగా గతంలో పశ్చిమ నదులపై చేపట్టని భారీ నీటి నిల్వ సామర్థ్యం గల ఆనకట్టల నిర్మాణ ప్రణాళికలు కూడా ఇందులో ఉన్నట్లు తెలుస్తోంది. పాకిస్థాన్ తన వ్యవసాయ అవసరాల్లో దాదాపు 80% మరియు జలవిద్యుత్ ఉత్పత్తిలో అధిక భాగానికి సింధు నదీ వ్యవస్థపైనే ఆధారపడి ఉంది. ఈ నదుల నుంచి వచ్చే నీటి ప్రవాహంలో ఏదైనా గణనీయమైన తగ్గుదల పాకిస్థాన్ ఆహార భద్రత, ఆర్థిక వ్యవస్థ, ఇంధన సరఫరాపై తీవ్ర ప్రతికూల పరిణామాలను కలిగిస్తుంది. సింధు నదిపై భారత్ చేపట్టిన నిర్వహణ పనుల అనంతరం తమ భూభాగంలోని ఒక కీలక నీటి స్వీకరణ కేంద్రంలో నీటి మట్టాలు ఏకంగా 90% పడిపోయాయని ఇస్లామాబాద్ ఇప్పటికే ఆందోళన వ్యక్తం చేసింది. భారత్ తన తాజా ప్రణాళికలతో ముందుకు సాగితే పాకిస్థాన్ ఎదుర్కోవలసిన సంక్షోభానికి ఇది ఒక చిన్న సూచన మాత్రమేనని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



సింధు జలాల ఒప్పందాన్ని భారత్ ఏకపక్షంగా నిలిపివేయడాన్ని పాకిస్థాన్ తీవ్రంగా ఖండించింది. తమకు రావలసిన నీటి ప్రవాహాలను ఆపడానికి లేదా మళ్లించడానికి చేసే ఎలాంటి ప్రయత్నాలనైనా 'యుద్ధ చర్యగా' పరిగణిస్తామని హెచ్చరించింది. కాగా, సింధు జలాల ఒప్పందం ప్రపంచంలోనే అత్యంత విజయవంతమైన నీటి భాగస్వామ్య ఒప్పందాలలో ఒకటిగా పేరుగాంచింది. ఇరు దేశాల మధ్య అనేక యుద్ధాలు, నిరంతర ఉద్రిక్తతలు నెలకొన్నప్పటికీ, ఈ ఒప్పందం మాత్రం దశాబ్దాలుగా నిలబడింది. ప్రస్తుత పరిణామాలు ఈ చారిత్రాత్మక ఒప్పందం భవిష్యత్తుపై నీలినీడలు కమ్ముకునేలా చేస్తున్నాయి.

ప్రభుత్వ రంగ సైనిక విమానాల తయారీ సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) శుక్రవారం ఒక కీలక ప్రకటన చేసింది. అమెరికా టెక్ దిగ్గజం జీఈ నుంచి ఇంజన్ల సరఫరా మొదలవడంతో, ఈ ఏడాది భారత వైమానిక దళానికి (ఐఏఎఫ్) 12 తేలికపాటి యుద్ధ విమానాలు (ఎల్‌సీఏ) ఎంకే1ఏలను అందించగలమని హెచ్ఏఎల్ ధీమా వ్యక్తం చేసింది. రాబోయే రెండు నెలల్లోనే తొలి యుద్ధ విమానాన్ని సిద్ధం చేస్తామని ఆర్థిక ఫలితాల వెల్లడి సందర్భంగా సంస్థ ప్రతినిధులు తెలిపారు.

తేజస్ ఎల్‌సీఏ ఎంకే1ఏ అనేది హెచ్ఏఎల్ అభివృద్ధి చేసిన దేశీయ తేలికపాటి యుద్ధ విమానం (ఎల్‌సీఏ) తేజస్‌కు ఆధునిక రూపం. ఇది 4.5వ తరం బహుళ ప్రయోజన యుద్ధ విమానంగా రూపొందించబడింది. అత్యాధునిక పోరాట సామర్థ్యాలు, మెరుగైన మనుగడ, కార్యాచరణ దక్షత దీని ప్రత్యేకతలు. ఏప్రిల్ 2025 నాటికి తమ వద్ద సుమారు రూ.1.89 లక్షల కోట్ల విలువైన ఆర్డర్లు ఉన్నాయని హెచ్ఏఎల్ వెల్లడించింది. గత ఏడాది ఇదే సమయానికి ఇది రూ.94,000 కోట్లుగా ఉండటం గమనార్హం. 2025-26 ఆర్థిక సంవత్సరంలో తమ ఆదాయ వృద్ధి 8 నుంచి 10 శాతం మధ్య ఉండొచ్చని ఈ విమానాలు, హెలికాప్టర్ల తయారీ సంస్థ అంచనా వేస్తోంది. భవిష్యత్తులో రానున్న ఆర్డర్ల గురించి ప్రస్తావిస్తూ, మరో 97 ఎల్‌సీఏ ఎంకే1ఏ యుద్ధ విమానాలు, భారత వైమానిక దళం కోసం 143 ఏఎల్‌హెచ్ (అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్లు), భారత నౌకాదళం కోసం 10 డోర్నియర్ విమానాలకు ఆర్డర్లు రానున్నాయని, వీటి విలువ సుమారు రూ.1.25 లక్షల కోట్లు ఉంటుందని సంస్థ తెలిపింది.